ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
గురువారం 25 ఏప్రిల్ 2024


పార్టీల ఎన్నికల గుర్తులను ప్రజలకు చూపుతున్న చంద్రబాబు, పవన్


డెంకాడ మండలం సింగవరం రోడ్‌షోలో జనసంద్రం

జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలి

● సింగవరం రోడ్‌షోలో చంద్రబాబు ● ఊహించని విధంగా తరలివచ్చిన జనం ● ఈ ప్రభుత్వాన్ని దించకపోతే నష్టమే: పవన్‌కల్యాణ్


విజయనగరంలో చంద్రబాబు ప్రసంగానికి చప్పట్లు


సింగవరంలో మూడు జెండాల రెపరెపలు

నెల్లిమర్ల, ఏప్రిల్ 24: జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రతి ఒక్కరు సన్నద్ధం కావాలని టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని డెంకాడ మండలం సింగవరం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్‌షోలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఓ దోపిడీ దారుడు, అహంకారి, విధ్వంసకారి అని విమర్శించారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని, ప్రధానంగా ఉత్తరాంధ్రను దోపిడీ చేశారని విమర్శించారు. తండ్రి మరణాన్ని ఒకసారి, బాబాయ్ హత్యను మరోసారి, తాజాగా గులకరాయి దెబ్బను ఉపయోగించి ప్రజలముందుకు వచ్చేందుకు డ్రామాలు ఆడుతున్నాడని విమర్శించారు. ఈ ఐదేళ్ల హయాంలో ఒక్క పరిశ్రమ అయినా తెచ్చాడా, ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా పూర్తి చేశాడా అని ప్రశ్నించారు. భోగాపురం విమానాశ్రయాన్ని తాను శంకుస్థాపన చేస్తే జగన్ మళ్లీ పునః శంకుస్థాపన చేశారని ఎద్దేవా చేశారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అక్రమాలకు అనకొండగా మారారని చంద్రబాబు విమర్శించారు. తంగుడుబిల్లి గ్రానైట్ కొండను దోచుకున్నారని, డెంకాడ మండలంలో ఇసుకను దోపిడీ చేశారని విమర్శించారు. కూటమి అభ్యర్థులు లోకం నాగమాధవి, కలిశెట్టి అప్పలనాయుడును గెలిపించాలని చంద్రబాబు కోరారు.

వలసలు ఆగాలి.. పరిశ్రమలు రావాలి: పవన్

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి నష్టమేనని అన్నారు. వైసీపీ హయాంలో ఉత్తరాంధ్రలో ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయని, వలసలు ఆగాలి.. పరిశ్రమలు రావాలని ఆయన ఆకాంక్షించారు. డెంకాడ మండలం మన్యాలపేటలో కిడ్నీ రోగులు అధికంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే రామతీర్థసాగర్ రిజర్వాయర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి సాగునీరు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఫార్మా కంపెనీల వల్ల తాగునీరు కాలుష్యం కాకుండా కాలుష్య నియంత్రణ మండలిని బలోపేతం చేస్తామన్నారు. రోడ్‌షోలో కూటమి అసెంబ్లీ అభ్యర్థి లోకం నాగమాధవి, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, మూడు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూ కబ్జాలకు అడ్డుకట్ట పడాలి..

విజయనగరం రూరల్: విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల భూ కబ్జాలు.. సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారని, అరాచక శక్తులను ఓడించి టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజును ఎన్నికల్లో గెలిపించాలని చంద్రబాబు కోరారు. నగరంలోని కలెక్టరేట్ కూడలిలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు బుధవారం రోడ్‌షో నిర్వహించారు. తొలుత చంద్రబాబు మాట్లాడుతూ, అవినీతి మరకలేని అశోక్ గజపతిరాజు కుమార్తెను గెలిపించాలని కోరారు. మాన్సాస్ ట్రస్టు పరిధిలోని విద్యాలయాలపై జగన్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, ఎంతో మంచి ఉద్దేశంతో నెలకొల్పిన విద్యాలయాలను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో కక్ష సాధింపులు, అరాచకాలతో పాటు గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతున్నాయన్నారు. జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికలు చాలా కీలకమని, రాష్ట్ర భవిష్యత్తుని నిర్దేశించేవన్నారు.


విజయనగరంలో అభ్యర్థులతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్




నామినేషన్ వేస్తున్న కళావెంకటరావు, కోళ్ల లలితకుమారి

నామినేషన్ల షురూ..

చీపురుపల్లి/ శృంగవరపుకోట, ఏప్రిల్ 24: చీపురుపల్లి అసెంబ్లీ స్థానానికి కూటమి తరపున పోటీ చేస్తున్న కిమిడి కళావెంకటరావు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు, పార్టీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, గద్దే బాబూరావు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు వెంటరాగా ఆర్వోకు నామినేషన్ పత్రాన్ని అందజేశారు. తనకు రూ.6,74,57,961ల స్థిర, చర ఆస్తులున్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. భార్య పేరు మీద రూ.21,49,07,622లు ఉన్నట్టు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ఒకటి, విజయనగరం జిల్లా నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదై ఉన్నట్టు పేర్కొన్నారు.

ఎస్.కోట నుంచి లలితకుమారి..

శృంగవరపుకోట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి బుధవారం ఆర్వో మురళీకృష్ణకు నామినేషన్ పత్రాలు అందజేశారు. డమ్మీగా ఆమె తల్లి గొంప సత్యవతి నామినేషన్ వేశారు. లలితకుమారి వెంట టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుధారాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బుచ్చి అప్పలరామప్రసాద్, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త ఒబ్బిన సత్యనారాయణ ఉన్నారు.

పార్లమెంట్‌కు 5, అసెంబ్లీకి 45 దాఖలు

కలెక్టరేట్, ఏప్రిల్ 24: పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ల పర్వం జోరుగా సాగుతోంది. బుధవారం పార్లమెంట్‌కు ఐదు, అసెంబ్లీ స్థానాలకు 45 నామినేషన్లు దాఖలయ్యాయి. తెలుగుదేశం పార్టీ లోక్‌సభ డమ్మీ అభ్యర్థిగా కలిశెట్టి రామలక్ష్మి రెండు సెట్లను దాఖలు చేయగా, కాంగ్రెస్ పార్టీ తరుపున బొబ్బిలి శ్రీను, నవ భారత నిర్మాణ సేవా పార్టీ అభ్యర్థిగా వంగపండు మహేశ్వరరావు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మికి అందజేశారు.

రెండో రోజూ బస్సులు లేవ్

బొబ్బిలి, ఏప్రిల్ 24: బొబ్బిలిలో బుధవారం వరుసగా రెండో రోజూ కూడా ఆర్టీసీ బస్సులు లేక జనం తిప్పలు పడ్డారు. ఓ పల్లెవెలుగు బస్సును ఎక్స్‌ప్రెస్‌గా నడిపినా ఆశ్రయించక తప్పలేదు. సీఎం జగన్ బహిరంగ సభలు పెడుతున్నారంటే చాలు పచ్చని చెట్లపై వేటు పడడం ఎంత సర్వసాధారణమో.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించా లనుకునే వారికి కష్టాలు పడడం కూడా అంతే సాధారణం. పార్వతీపురం, సాలూరు ఆర్టీసీ డిపోల నుంచి బస్సులను సీఎం సభకు వైసీపీ కార్యకర్తలను తరలించేందుకు వినియోగించడంతో సామాన్య ప్రయాణికులకు బుధవారం కూడా అవస్థలు తప్పలేదు. బస్సులు లేక బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు పడిగాపులు కాశారు. గంటల కొలదీ వేచి ఉన్నప్పటికీ బస్సులు రాకపోవడంతో చాలా మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

కిక్కిరిసిన మద్యం షాపులు

● వైసీపీ అభ్యర్థి నామినేషన్‌లో పారిన మద్యం


రాజాం/ రూరల్, ఏప్రిల్ 24: రాజాంలోని మద్యం దుకాణాలు, బార్లు వైసీపీ శ్రేణులతో కిక్కిరిసాయి. బొబ్బిలి రోడ్‌లోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానం నుంచి శ్రీకాకుళం రోడ్‌లోని తహసీల్దార్ కార్యాలయం వరకూ ఉన్న మూడు మద్యం షాపులు, రెండు బార్లు బుధవారం రద్దీగా కనిపించాయి. వైసీపీ జెండాలు, టోపీలతో నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన జనం షాపు ముందు క్యూ కట్టారు. ఆ పార్టీ తరపున రాజాం అభ్యర్థిగా డా.తలే రాజేష్ నామినేషన్ వేసిన సందర్భంగా పట్టణంలో ఈ పరిస్థితి కనిపించింది. దాదాపుగా అన్ని మద్యం షాపుల వద్ద సీఎం జగన్‌ను తిట్టే పరిస్థితి కనిపించింది. కేవలం రూ.150 బాటిళ్లు అందుబాటులో ఉండడం, మందుబాబులకు కావాల్సిన బాటిళ్లతో పాటు బీర్లు లేకపోవడంతో మద్యం ప్రియులంతా బహిరంగంగానే శాపనార్థాలు పెట్టడం కనిపించింది. కొందరు షాపుల్లోని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.


రాజాం మెయిన్‌రోడ్‌లో మద్యం షాపు వద్ద వైసీపీ శ్రేణుల హంగామా

● వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు ముందు అమ్మవారి సన్నిధిలో నామినేషన్ పత్రాలను ఉంచి పూజలు చేశారు. ఈసమయంలో ఆయన గన్‌మెన్ షూ ధరించి ఆలయంలోకి రావడం విమర్శలకు దారితీసింది.

అందరూ సౌమ్యులట... ఉత్తములేనట!

● మరి భూ కబ్జాలు.. సెటిల్‌మెంట్ల సంగతేంటో?
● అక్రమ పంథాలో వెళ్తున్న వారికి జగన్ పొగడ్తలు
● దౌర్జన్యాలు చేసిన వారినీ కీర్తించిన ముఖ్యమంత్రి



(విజయనగరం- ఆంధ్రజ్యోతి)

'ఎమ్మెల్యేలు సౌమ్యులు.. మంచి వారు.. మనసు వెన్నవంటిది' అంటూ ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తున్న తమ ఎమ్మెల్యే అభ్యర్థుల గురించి సీఎం జగన్ మంగళవారం జిల్లాలో జరిగిన సిద్ధం సభలో చెప్పుకొచ్చారు. వైసీపీ అభ్యర్థులను పరిచయం చేస్తూ ఇలాంటి పాలన మళ్లీ కావాలంటే వీరినే ఎన్నుకోవాలని కోరారు. నిజంగా వారంతా అంత మంచి వారా? అని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. దందాలు.. భూ కబ్జాలు.. సెటిల్‌మెంట్లు.. నేరాలు చేస్తున్న వారి సంగతేంటని ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ముందు ఓ మహిళ బొండపల్లిలోని మహిళాగళం సభలో విలపించింది. తన భూమి రికార్డులు మార్చేసి అధికార పార్టీ నేతలు దౌర్జన్యం చేస్తున్నట్లు కంటతడి పెట్టింది. ఈ దందా వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందని స్పష్టం చేసింది. ధైర్యంగా ముందుకొచ్చి ఈ ప్రభుత్వంలో తనకు ఎదురైన కష్టాలను విన్నవించింది. ఇలాంటి బాధితులు ప్రతి మండలం.. గ్రామం.. వీధిలోనూ ఉన్నారు. వీటన్నింటినీ విస్మరించిన సీఎం మళ్లీ అధికారం కోసం ఎమ్మెల్యేలంతా బాగా పనిచేసినట్లు కితాబు ఇవ్వడాన్ని ప్రతి ఒక్కరూ విమర్శిస్తున్నారు. ఆయా నేతల గురించి సంక్షిప్తంగా..

భూములపై ఆయన కన్నేశారంటే..

జిల్లాలోని ఓ ఎమ్మెల్యే భూ కబ్జాలకు కొదవలేదు. అనుచరులతో 'సౌమ్యంగా' భయపెట్టి తన దారికి తీసుకురావడంలో దిట్ట. ఇలా దేవదాయ భూములు, 22ఎ భూములు, తన భూములను అనుకుని ఉన్న రైతుల భూములపై కన్నేస్తారు. తమ దారికి రాకుంటే రికార్డులను ట్యాంపరింగ్ చేస్తారు. తొలుత అనుచరులే రాయబేరాలు కుదురుస్తారు. తక్కువ డబ్బులకే 'వెన్నలాంటి మనసు'తో భూములు తమ పరం చేసుకుని బినామీల పేరుతో రిజిస్ట్రేషన్లు జరిపించేస్తారు. భూములివ్వని వారిపై నిఘా వేసి ఎక్కడ దొరుకుతారా అన్న 'మంచి తనం'తో నిత్యం నిఘా పెడతారు. సోదరుని అధికారం కూడా కలిసి రావటంతో రెండు చేతులా ఆస్తులు కూడగట్టారు.

రియల్ ఎస్టేట్.. సెటిల్‌మెంట్లే పనిగా..

ఆ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే రియల్ ఎస్టేట్.. చిట్టీల వ్యాపారాల్లో ఆరితేరారు. స్థలాల అమ్మకం.. చిట్టీలు కట్టించుకోవడం.. రెండింటికీ లింకు పెట్టి ఇబ్బందులకు గురిచేయటం.. ఆయన శైలి. రైతు బజారుకు సమీపంలోని ఓ స్థలం లావాదీవీల్లో ఇదే కోణంలోనే ఇరికించి ఆ వ్యవహారం కోర్టుకు వెళ్లేలా చేశారు. తన సొంత నియోజకవర్గంలోనే కాకుండా పక్క నియోజకవర్గాల్లో సైతం తన కుటుంబీకులు, బంధువుల పేరుతో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తారు. చెరువులు, ప్రభుత్వ స్థలాలు కలిపేస్తారు. కబ్జా చేసేందుకు భూములుంటాయి కాని డిగ్రీ కళాశాలకు సొంత భవనాలకు మాత్రం స్థలం కొరతను చూపిస్తున్నారు.

సౌమ్యంగా కన్పిస్తారంతే..

పూర్వం రాజుల ఏలుబడిలో ఉన్న ఆ నియోజకవర్గంలో సౌమ్యంగా కన్పించే ఆ ఎమ్మెల్యే చేసే పనులు మాత్రం విచిత్రంగా ఉంటాయి. ఇద్దరు అన్నదమ్ములూ ఎమ్మెల్యేలు మాదిరిగా వ్యవహరిస్తుంటారు. ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలను సైతం ఇద్దరూ చెరో గ్రామాలవైపు వెళ్లి నిర్వహిస్తుంటారు. ఇలా పదవిని సర్దుకుపోవటం కూడా జగన్ దృష్టిలో మంచితనమే నేమో. ఆ నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిని పట్టించుకోరు. స్వయంగా ఇచ్చిన హామీలనూ నెరవేర్చరు.

తిట్టిన వారినే నెత్తిన పెట్టుకుని..

ఆయన కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా.. మంత్రిగా కొనసాగుతున్నపుడు జగన్‌పై ధ్వజమెత్తేవారు. పరుష పదజాలాన్ని వినియోగించిన సందర్భాలున్నాయి. ఓక్స్‌వ్యాగన్ కార్ల ఫ్యాక్టరీ అక్రమాలపై రాష్ట్రం అట్టుడికినప్పుడు కూడా ఆయన్ను పరిశ్రమల శాఖ నుంచి మరో శాఖకు మార్చారు. కాగా చెల్లూరు సిద్ధం సమావేశంలో జగన్ అతన్ని తన తండ్రి వంటి వారని సంబోధించారు. గతం మరిచిన జగన్ రాజకీయాలే ముఖ్యంగా భావించారన్న విమర్శలు జనం నుంచి వ్యక్తమవుతున్నాయి.

'రెవెన్యూ'పైనే ఆయన దృష్టి

విశాఖ జిల్లాను అనుకుని ఉన్న ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే భూ దందాలకు కొదవే లేదు. వివాదాస్పద స్థలంలో ఇల్లు కట్టిన దగ్గర నుంచి భూముల కుంభకోణాల వరకూ ఎన్నో అక్రమాల ఆరోపణలు ఉన్నాయి. సొంత పార్టీలోని కీలక నేతలు సైతం ఎమ్మెల్యేతో విభేదించి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రెవెన్యూ కార్యక్రమాలను తన కనుసన్నల్లో నిర్వహించుకునేందుకు ఏకంగా తహసీల్దార్లను మార్చిన సంఘటనలున్నాయి.

ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఉన్నా..

విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఉన్న ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేపై తీవ్ర స్థాయిలో వ్యతిరేకత ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆ నియోజకవర్గం నుంచి వేరే చోటుకు బదిలీ చేస్తారన్న ప్రచారం జరిగింది. ఆ ఎమ్మెల్యేను కూడా జగన్ మంచివాడు, మనసు వెన్న అయితే కొంత ఖటువుగా ఉంటాడు అంటూ ప్రస్తావించారు.

చీమ చిటుక్కుమన్నా ఆయనకు చెప్పాల్సిందేనట

ఆ ఎమ్మెల్యే జిల్లాలోని కీలక నేతలకు బంధువు. దీంతో తనకు ఎదురు లేదని వ్యవహరిస్తూ ఉంటారు. సొంతంగా గనులను చేజిక్కించుకునేందుకు పథకం పన్నారు. గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండానే గనుల తవ్వకాలకు సిద్ధం అయ్యారు. నియోజకవర్గంలో చీమ చిటుక్కుమన్నా ఎమ్మెల్యేకు చెప్పాల్సిందేనట. ఎవరు భూముల అమ్మకాలు.. కొనుగోలు చేసినా చెప్పాల్సిందే. అభివృద్ధి పనుల విషయంలో మాత్రం స్పందన ఉండదు.

విమర్శించి.. మిన్నకుండి..

ఆ నేత పరిధి చాలా ఎక్కువ. ఆయన అవినీతిపై గళం విప్పుతారు. విద్యుత్ శాఖ పరిధిలోని ఉద్యోగాలను అమ్మేశారంటూ విమర్శలు చేస్తారు. తరువాత సొంత పార్టీ, ప్రభుత్వంలో జరిగిన అక్రమాలే తెలుసుకుని మిన్నకుండిపోతారు. అంటే అవినీతి జరిగినా దానిని నిలదీసినట్లు నిలదీసి మళ్లీ మిలాఖత్ కావడాన్నే మంచి తనం అంటారేమో మరి.

జన కేతనం
ఆంధ్రజ్యోతి

6 విజయనగరం పార్వతీపురం మన్యం

గురువారం 25 ఏప్రిల్ 2024 | జిల్లాల వార్తలు

పీపుల్స్ మేనిఫెస్టో

ఉచితాలు కాదు.. ఉపాధి కావాలి



సాలూరు రూరల్: ఉపాధి అందించాలి. మా బిడ్డలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిస్తేనే బాగుంటుంది. ఉచిత పథకాలు ఎవరడిగారు. దానికేస్తున్నాం.. దీనికి వేస్తున్నాం అంటున్నారు. మరోవైపు ధరలు పెరిగిపోతున్నాయి. కరెంట్ బిల్లులు భరించలేనంతగా ఉన్నాయి. బస్సు ఎక్కాలంటే చార్జీలు భయపెడుతున్నాయి. ఆటో చార్జీలు సైతం విపరీతంగా పెంచారు. ఉచితాలిచ్చి ఇలా భారం మోపడం తగదు. ఉపాధి, ఉద్యోగ అవకాశం కల్పించే వారికి మద్దతు ఇస్తాను. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయి. యువతకు ఉపాధి కల్పించేలా పాలకులు దృష్టి సారిస్తే మంచిది. సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా చాలా ముఖ్యం. ఆ దిశగా పాలకు దృష్టి సారించాలి.

- రామ్మి, పార్వతమ్మ, చిరువ్యాపారి, మామిడిపల్లి

పెద్ద నోటు - ఈసారి లోటు



గరుగుబిల్లి: ఎన్నికలొచ్చాయంటే నగదు, మద్యానిదే కీలక భూమిక. నోటిఫికేషన్ మొదలు ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లే వరకూ ఈ రెండే ప్రభావం చూపిస్తుంటాయి. ఓటర్లను దారిలోకి తెచ్చుకోవాలన్నా.. ఫిరాయింపులు అడ్డుకోవాలన్నా వీటి అవసరం అంతా ఇంతా కాదు. జేబులో చేయి పెట్టి నోటు తీస్తే కట్టంతా ఇవ్వాలని అడిగే రోజులివి. అభ్యర్థుల అదృష్టమో.. ఓటరు దురదృష్టమో తెలియదు గానీ ఈ ఎన్నికల్లో పెద్ద నోట్లు కనిపించకుండా పోయాయి. 2014 సాధారణ ఎన్నికల్లో పెద్ద నోటు అంటే వెయ్యి ఒక్కటే. ఆ తరువాత నోట్ల రద్దుతో వెయ్యి నోటు అడ్రస్ లేకుండా పోయింది. 2019 ఎన్నికల నాటికి రూ.2 వేల నోటు వచ్చింది. ఇప్పుడు అదీ కనిపించడం లేదు. జేబులోకి చెయ్యి పోనిస్తే రూ.500 నోటు లేదా రూ.200 నోటు పెద్దవిగా కనిపిస్తున్నాయి. ఓటరుకైనా, నాయకుడికైనా పెద్ద నోటు ప్రస్తుతానికి ఇదే. అలాగని ఒకటో, రెండో నోట్లు ఇచ్చినా ఓటరు సంతృప్తి పడే రోజులు పోయాయని అభ్యర్థులు ఇప్పుడు పెద్ద నోట్ల వేటలో పడ్డారు.

అందరం కలిసి నిర్ణయించేవాళ్లం

పెద్దల మాట



నా పేరు గుల్ల రాముడమ్మ. మాది వంగర మండలం బాగెమ్మపేట. నా వయసు 94 ఏళ్లు. నేను చాలా ఎన్నికలు చూశాను. ఏనాడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదు. గ్రామాల్లో ప్రచారాలు విచిత్రంగా కనిపిస్తున్నాయి. గతంలో గ్రామంలో అందరం చర్చించుకుని... ఎంతోకొంత మంచి చేసే వారికి ఓటు వేసేవాళ్లం. నాయకులు ఓట్లు అడగటానికి గ్రామాలకు వచ్చినపుడు గౌరవంగా ఉండేవారు. ముందువచ్చిన వారి ప్రచారం ముగిసిన తరువాత రెండో వర్గం గ్రామంలోకి వచ్చేవారు. ప్రతి ఒక్కరినీ పలుకరిస్తూ..ఓట్లు అడిగేవారు. ఇప్పుడు అభ్యర్థి కరపత్రం అందజేస్తే... పక్కనున్న వాళ్లు అన్నీ చెబుతున్నారు.

- వంగర


ఆంధ్రకేసరి ఇక్కడి నుంచే!

ఓవైపు విశాఖపట్నం..మరోవైపు విజయనగరం.. రెండు జిల్లాల సంస్కృతుల కలబోత శృంగవరపుకోట ప్రత్యేకత. కొన్నాళ్లు ఎస్టీ నియోజవర్గంగా కొనసాగిన ఎస్.కోట ప్రస్తుతం జనరల్‌గా ఉంది. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు ఇక్కడి నుంచి ఏకగ్రీవంగా ఎన్నికై.. శాసనసభలో అడుగు పెట్టారు.

- ఎస్.కోట నుంచి టంగుటూరి ఎన్నిక
- తొలి సీఎంగా బాధ్యతలు
- ప్రజా సోషలిస్టు పార్టీ తరపున ఏకగ్రీవం
- 1983 నుంచి టీడీపీకి కంచుకోట
- 25 ఏళ్లపాటు గిరిజనుల ప్రాతినిధ్యం

శృంగవరపుకోట నియోజకవర్గ ముఖచిత్రం





టంగుటూరి ప్రకాశం పంతులు

(శృంగవరపుకోట)

'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులును ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా అందించిన చరిత్ర శృంగవరపుకోట నియోజకవర్గానిది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో 1952లో ఈ నియోజకవర్గం ఏర్పాటైంది. అప్పట్లో జరిగిన ఎన్నికల్లో మొట్టమొదటిసారిగా సోషలిస్టు పార్టీకి చెందిన చాగంటి వెంకట సోమయాజులు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రత్యేక రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసిన సంగతి తెలిసిందే. 1953లో ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించింది. దీనికి తొలి ముఖ్యమంత్రి గా టంగుటూరి ప్రకాశం పంతులు నియమితులయ్యారు. ఆయనను శాసన సభ్యుడిగా ఎన్నుకొనేందుకు వీలుగా ఈ నియోజకవర్గానికి అప్పటికే ప్రాతినిధ్యం వహిస్తున్న సీవీ సోమయాజులు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో జరిగిన ఉప ఎన్నికల్లో ఆంధ్రకేసరి తాను స్థాపించిన ప్రజా సోషలిస్టు పార్టీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించి.. ముఖ్యమంత్రిగా వ్యవహరించారు.

టీడీపీకి కంచుకోట

ఈ నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఇంత వరకు ఏడుసార్లు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంది. ఐదుసార్లు కాంగ్రెస్ పార్టీ, నాలుగుసార్లు సోషలిస్టు పార్టీ, ఒకసారి ఇండిపెండెంట్, ఒకసారి వైసీపీ ఈ నియోజకవర్గంలో జెండా ఎగరవేశాయి. 1983లో దివంగత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. అప్పటి నుంచి ఆ పార్టీ అభ్యర్థి లగుడు బారికి దుక్కు 1994 వరకు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999లో శోభా హైమావతి, 2009, 2014లో కోళ్ల లలిత కుమారి టీడీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ప్రభావంతో 2004లో కాంగ్రెస్ అభ్యర్థి కుంభా రవిబాబు.. 2019లో వైసీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు ఈ స్థానాన్ని దక్కించుకున్నారు. టీడీపీకి పట్టున్న నియోజకవర్గంతో పాటు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగానే అత్యధిక పర్యాయాలు ఇక్కడ ప్రజలు ఓట్లేసినట్లు గణంకాలు చెబుతున్నాయి.

అత్యధికం.. అత్యల్పం టీడీపీవే..

శృంగవరపుకోట నియోజకవర్గ ఆవిర్భావం నుంచి అత్యధిక, అత్యల్ప మెజారిటీతో గెలుపొందినది టీడీపీ అభ్యర్థులే. 2014లో టీడీపీ నుంచి గెలుపొందిన కోళ్ల లలిత కుమారికి 28,572 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇదే పార్టీకి చెందిన ఎల్.బి. దుక్కుకు 1983 ఎన్నికల్లో 27,185, 1985లో 28,385 ఓట్ల మెజారిటీ వచ్చింది. 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి శోభా హైమావతి అత్యల్పంగా 678 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

ఇద్దరు స్థానికేతరులు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత రెండుదఫాలు మాత్రమే ఓటమి చవిచూసింది. ఓసారి కాంగ్రెస్, మరోసారి వైసీపీ ఇక్కడ గెలిచాయి. ఈ పార్టీల నుంచి నిలబడిన ఇద్దరు అభ్యర్థులూ స్థానికేతరులే. 2004లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన కుంభా రవిబాబు గుంటూరుకు చెందిన వారు. ఆంధ్ర యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న ఆయనకు టిక్కెట్‌ను కేటాయించారు. నియోజకవర్గ పునర్విభజన అనంతరం జనరల్‌గా మారిన ఈ నియోజకవర్గంలో 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసి గెలుపొందిన కడుబండి శ్రీనివాసరావు గజపతినగరం నియోజకవర్గ పరిధిలోని దత్తిరాజేరు మండలానికి చెందినవారు.

ఎస్.కోటలో ఎమ్మెల్యేలు ఇలా..



కోళ్ల అప్పలనాయుడు



ఎల్‌బీ దుక్కు



కోళ్ల లలిత కుమారి

- 1952లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో సోషలిస్టు పార్టీకి చెందిన సీవీ సోమయాజులు కాంగ్రెస్ అభ్యర్థి టి.వెంకట రామారావుపై 11,688 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 1953లో జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజా సోషలిస్టు పార్టీ అభ్యర్థి టంగుటూరి ప్రకాశం పంతులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- 1955లో ప్రజా సోషలిస్టు పార్టీ అభ్యర్థి సీవీ సోమయాజులు స్వతంత్ర అభ్యర్థి జీవీ అప్పారావుపై 5,468 ఓట్ల తేడాతో విజయం సాధించారు.
- 1960లో కాంగ్రెస్ అభ్యర్థి జీడీ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- 1962లో కాంగ్రెస్ అభ్యర్థి జీడీ నాయుడు స్వతంత్ర అభ్యర్థి టి.రాములుపై 8,908 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 1967లో స్వతంత్ర అభ్యర్థి కోళ్ల అప్పలనాయుడు... కాంగ్రెస్ అభ్యర్థి కె.పద్మనాభరాజుపై 2,573 ఓట్లతో విజయం సాధించారు.
- 1972లో కాంగ్రెస్ అభ్యర్థి కె.పద్మనాభరాజు స్వతంత్ర అభ్యర్థి కోళ్ల అప్పల నాయుడుపై 13,900 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.
- 1978లో కాంగ్రెస్ అభ్యర్థి దూరి సన్యాసిదొర... స్వతంత్ర అభ్యర్థి బాలరాజుపై 5,363 ఓట్ల తేడాతో గెలుపొందారు.
- 1983లో తెలుగుదేశం అభ్యర్థి ఎల్.బి దుక్కు కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెపూరి గంగన్న దొరపై 27,185 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.
- 1985లో టీడీపీ అభ్యర్థి ఎల్.బి దుక్కు కాంగ్రెస్ అభ్యర్థి దూరు గంగన్నదొరపై 28,385 ఓట్ల మెజారిటీ సాధించారు.
- 1989లో టీడీపీ అభ్యర్థి ఎల్.బి దుక్కు కాంగ్రెస్ అభ్యర్థి ఎస్.రామచంద్రరావుపై 6,746 ఓట్ల తేడాతో గెలుపొందారు.
- 1994లో టీడీపీ అభ్యర్థి ఎల్.బి దుక్కు కాంగ్రెస్ అభ్యర్థి శెట్టి గంగాధర స్వామిపై 19,080 ఓట్ల తేడాతో విజయం సాధించారు.
- 1999లో టీడీపీ అభ్యర్థి శోభా హైమావతి కాంగ్రెస్ అభ్యర్థి శెట్టి గంగాధర స్వామిపై 678 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 2004లో కాంగ్రెస్ అభ్యర్థి కుంభా రవిబాబు... టీడీపీ అభ్యర్థి శోభా హైమావతిపై 5,802 ఓట్ల మెజారిటీ సాధించారు.
- 2009లో టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి.. కాంగ్రెస్ అభ్యర్థి అల్లుకేశవ వెంకట జోగినాయుడుపై 3,440 ఓట్ల తేడాతో విజయం సాధించారు.
- 2014లో టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి వైసీపీ అభ్యర్థి రొంగలి జగన్నాథంపై 28,572 ఓట్ల తేడాతో గెలుపొందారు..
- 2019లో వైసీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు.. టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారిపై 11,246 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.




కుంభా రవిబాబు

శృంగవరపుకోట పట్టణం



శోభా హైమావతి



కడుబండి శ్రీనివాసరావు

25 ఏళ్ల పాటు గిరిజనులే...


ఈ నియోజకవర్గ ఆవిర్భావం తరువాత 25 ఏళ్ల పాటు గిరిజనులు ప్రాతినిధ్యం వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా అరకు, అనంతగిరి గిరిజన ప్రాంతాలతో పాటు జిల్లాలోని శృంగవరపుకోట, జామి, వేపాడ మండలాలు గంట్యాడ మండల పరిధిలోని రెండు, మూడు గ్రామాలతో కలసి ఉన్న ఈ నియోజకవర్గాన్ని 1978లో గిరిజన నియోజకవర్గంగా ఎంపిక చేశారు. 2009 సార్వత్రిక ఎన్నికల వరకు గిరిజన శాసన సభ్యులు పరిపాలించారు. 2009లో అరకు గిరిజన నియోజకవర్గంగా అవతరించడంతో శృంగవరపుకోట తిరిగి జనరల్ నియోజకవర్గంగా మారింది. టీడీపీ అభ్యర్థిగా లడుగు బారికి దుక్కు ఎక్కువ కాలం ఈ నియోజకవర్గంలో ఆధిపత్యం చెలాయించారు. 1983 నుంచి 1999 వరకు 16 సంవత్సరాలు పాటు వరుసగా శాసనసభలో గిరిజనులకు ప్రాతినిధ్యం వహించారు. గిరిజన, సాధారణ సభ్యుల్లో మిగిలిన వారంతా పదేళ్ల లోపు శాసన సభ్యులుగా పనిచేసిన వారే.

ఇద్దరే ఏకగ్రీవవీరులు

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, గుజ్జల ధర్మానాయుడు (జీడీ నాయుడు) ఈ నియోజకవర్గంలో ఏకగ్రీవ వీరులుగా పేరొందారు. 1953లో జరిగిన ఎన్నికలో టంగుటూరి ప్రకాశం పంతులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1960లో గుజ్జల ధర్మానాయుడు ఏకగ్రీవంగానే ఎన్నికయ్యారు. ఈ ఇద్దరూ చెరో రెండేళ్లు మాత్రమే శాసన సభకు ప్రాతనిధ్యం వహించడం విశేషం. 1962లో మధ్యంతర ఎన్నికలు రావడంతో గుజ్జల ధర్మానాయుడు తిరిగి పోటీ చేయాల్సి వచ్చింది.

ఓటర్లు ఇలా	
మొత్తం ఓటర్లు:	2,20,309
పురుషులు:	1,07,188
మహిళలు:	1,13,117
ఇతరులు:	4

నియోజకవర్గం: శృంగవరపుకోట
మండలాలు: శృంగవరపుకోట, వేపాడ, లక్కవరపుకోట, కొత్తవలస, జామి (సగం గ్రామాలు)
ప్రధాన పట్టణాలు: శృంగవరపుకోట, కొత్తవలస



శృంగవరపుకోట నియోజకవర్గం మ్యాప్

1955 నుంచి 1960 వరకు ఇద్దరు ఎమ్మెల్యేలు

విజయనగరం జిల్లా ఆవిర్భవానికి ముందు ఈ నియోజకవర్గం విశాఖపట్టణం జిల్లాలో ఉండే ది. ఆ సమయంలో ప్రస్తుత అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకు నుంచి విజయనగరం జిల్లా పరిధిలోని కొత్తవలస వరకు ఈ నియోజకవర్గం విస్తరించి ఉండేది. దీంతో 1955 నుంచి 1960 వరకు ద్విసభలను నిర్వహించారు. గిరిజనులకు ఒకటి, గిరిజనేతరులకు మరొకటి ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో గిరిజనులకు ప్రాతినిధ్యం వహిం చేందుకు ప్రజా స్వతంత్ర పార్టీ తరపున గుజ్జల రామునాయుడు, జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున కె.వీరన్న పడాల్ పోటీ పడ్డారు. గుజ్జల రామునా యుడు విజయం సాధించారు. గిరిజనేతరులకు ప్రాతినిధ్యం వహించేందుకు ప్రజా స్వతంత్ర పార్టీ తరపున చాగంటి వెంకట సోమయాజులు, స్వతంత్ర అభ్యర్థిగా జీవీ అప్పారావులు బరిలోకి దిగారు. చాగంటి వెంకట సోమయాజులు విజయం సాధించారు.

ఇవి ఎన్నికల 'యాప్'లు

- పారదర్శకంగా నిర్వహణకు మార్గాలు

(గరుగుబిల్లి)

గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల సంఘం వివిధ ఓటర్లకు పూర్తిస్థాయి సమాచారం అందించేందుకు... సాంకేతిక సహకారం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఫిర్యాదులు చేసేందుకు, అలాగే ఓటర్లకు ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక యాప్‌లు, పోర్టర్‌లు, వెబ్‌సైట్‌లు అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లను వినియోగించుకొనేందుకు అధికంగా ముందుకు వస్తున్నారు. తప్పు చేసిన వారికి క్షణాల్లో శిక్ష అమలయ్యేలా రూపొందించింది. వాటిని ఓసారి చూద్దాం..

ఓటరు సాయానికి 'వీహెచ్ఎస్'



ఓటర్ల సమాచారాన్ని తెలుసుకొనేందుకు వీలుగా ఓటరు హెల్ప్‌లైన్ యాప్ (వీహెచ్‌ఏ) పేరిట ప్రత్యేక వ్యవస్థను ఎన్నికల సంఘం రూపొందించింది. ఇందులో ఓటు నమోదు చేసుకునేందుకు వీలుగా దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. జాబితాలో పేర్లు ఉన్నాయా? లేదా? అన్నది సులువుగా తెలుసుకోవచ్చు. ఎపిక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఫిర్యాదులకు ప్రత్యేకం 'ఎన్జీఎస్'



ఓటర్లు ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ (ఎన్జీఎస్) పేరిట ఒక పోర్టల్ ఉంది. ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫిర్యాదులను ఇందులో నమోదు చేయవచ్చు. దేశ వ్యాప్తంగా ఏ నియోజకవర్గానికి చెందిన ఫిర్యాదులైనా ఇందులో నమోదు చేయవచ్చు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివరాలను పొందుపరిస్తే సంబంధిత నియోజకవర్గ అధికారులు వీటిని పరిశీలించి చర్యలు చేపడతారు.

అభ్యర్థి గురించి తెలుసుకోండిలా..

మీ అభ్యర్థి గురించి తెలుసుకునేందుకు నో యువర్ క్యాండిడేట్, కేవైసీ పేరిట ఒక వెబ్‌సైట్ ఉంది. అభ్యర్థులు నామినేషన్ల సందర్భంగా దాఖలు చేసే ప్రమాణ పత్రాలు (అఫిడవిట్‌లు) ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఎన్నికల సంఘం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించింది. పోటీలో ఉన్న అభ్యర్థి ఎలాంటి వారు, వారికి నేర చరిత్ర ఏమైనా ఉందా, వారికి ఏఏ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి, స్థిర, చరాస్తుల వివరాలు, బంగారు ఆభరణాల వివరాలను తెలుసుకోవచ్చు.

'సి-విజిల్'తో అక్రమాలకు చెక్



ఎన్నికల్లో ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు ఉద్దేశించిన యాప్ ఇది. ప్రజలు తాము గుర్తించిన అక్రమాలను సి-విజిల్ యాప్‌లో సంక్షిప్తంగా నమోదు చేయాలి. వంద నిమిషాల వ్యవధిలో అధికారులు ఆ ప్రదేశానికి చేరుకుని సమాచారం ఆధారంగా చర్యలు తీసుకుంటారు. తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదు చేసిన వ్యక్తి ఫోన్‌కు మెసేజ్ రూపంలో తెలుపుతారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడం ఈ యాప్ ప్రత్యేకత.


దివ్యాంగుల చేయూతకు 'సాక్ష్యం'

వయోవృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం సాక్ష్యం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ కేంద్రానికి సొంతంగా రాలేని వారు ఇందులో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. నమోదు చేసుకున్న వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకు వచ్చేందుకు అధికారులు రవాణా సదుపాయాన్ని కల్పిస్తారు. దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీని సమకూర్చుతారు.

మీరూ.. తెలుసుకోండి

(రాజాం రూరల్)

- ఏ కారణంతోనైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమైతే పోలింగ్ సమయాన్ని పెంచరు. నిర్దీత సమయానికి క్యూ లైన్లలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎంత రాత్రయినా సరే వారందరూ ఓటు వేసేవరకూ పోలింగ్ కొనసాగుతుంది.
- పోలింగ్ కేంద్రంలో గానీ, కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో గానీ అభ్యర్థితో పాటు ఏ వ్యక్తి కూడా ఫలానా గుర్తు, వ్యక్తికి ఓటు వేయాలని ప్రచారం చేయడం శిక్షార్హం. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్ 130 ప్రకారం నేరం.
- గ్రామాలు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏవైనా కారణాలతో ఓటింగ్‌ను బహిష్కరిస్తే రీపోలింగ్ నిర్వహించరు.
- పోలింగ్ కేంద్రం పరిధిలో గానీ.. 100 మీటర్ల దూరంలో గానీ అభ్యర్థి మీడియాతో మాట్లాడకూడదు. అది చట్టరీత్యా నేరం.
- పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి గన్‌మెన్‌కు అనుమతి లేదు. ఒకవేళ ఓటు వేసేందుకు గన్‌మెన్ వస్తే తన ఆయుధాన్ని బయట ఉన్న పోలీసుల వద్ద ఉంచి... ఓటు వేసి తిరిగి వచ్చి... తన ఆయుధాన్ని తీసుకోవాలి.
- ఓటు వేసేటపుడు ఫొటోలు తీయడం, వీడియో చిత్రీకరణ నేరం, ఇది రహస్య ఓటింగ్‌కు భంగం కలిగిస్తుంది.



జన కేతనం
ఆంధ్రజ్యోతి గురువారం 25 ఏప్రిల్ 2024




శిథిలమైన పురపాలక సంఘ కార్యాలయం భవనం

ఎక్కడ ఉండమంటారు?

- ముని్సపాలిటీకి కార్యాలయం లేని వైనం
- పంచాయతీ భవనం నుంచే కార్యకలాపాలు
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది
- కార్యరూపం దాల్చని ఎమ్మెల్యే హామీ

(రాజాం)

రాజాం పురపాలక సంఘ భవనం పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది. పంచాయతీ నుంచి నగర పంచాయతీ ఆ తర్వాత మున్సిపాల్టీగా స్థాయి పెరిగినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో కార్యాలయం సమకూరలేదు. దశాబ్దాల కిందట నిర్మించిన రాజాం పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనం పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం గదిలో స్లాబ్ పెచ్చులూడి ఇటీవల సిబ్బందిపై పడింది. అంతేకాకుండా వర్షాకాలం వచ్చిందంటే ఈ గదిలో విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు టార్పాలిన్లు కప్పుకొని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆదాయం వస్తున్నా..

పురపాలక సంఘానికి ఆదాయం వస్తున్నా నూతన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాది ఆస్తి, తాగునీటి పన్నులతో పాటు వాణిజ్య సముదాయాలు అద్దెలు, ఇంటిప్లాన్లు, అనుమతులు, ఖాళీ స్థలాల పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, మార్కెట్ కిస్తీ తదితర వాటి నుంచి ఏడాదికి రూ.6 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. పురపాలక సంఘానికి సరిపడా వసతి లేక పోవడంతో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆర్టీసీ కూడలిలో అన్న క్యాంటీన్ కోసం రూ.40 లక్షలతో నిర్మించిన భవనం విషయంలో అధికారులు దృష్టిపెట్టారు. ఈ భవనాన్ని ముందుగా స్వయంశక్తి సంఘాలు వారు తయారు చేస్తున్న వస్తువులను విక్రయించేందుకు మహిళా బజార్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ తరువాత పట్టణ ప్రణాళిక విభాగం, శానటరీ ఇన్‌స్పెక్టరు కార్యాలయాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపడుతున్నారు.

ఉన్నస్థలం ధారాదత్తం

ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో ఉన్న స్థలాన్ని ఆర్టీసీ కాంప్లెక్స్, రైతు బజారు, వార్డు సచివాలయం నిర్మాణానికి ధారాదత్తం చేసిన అధికారులు.. ఇప్పుడు నూతన భవన నిర్మాణానికి స్థలం కోసం వెతుకులాట ప్రారంభించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలం ఏ శాఖకూ కేటాయించకుండా ఉంటే పురపాలక సంఘ కార్యాలయ నూతన భవనం నిర్మాణానికి ఉపయోగపడేది. పట్టణ నడిబొడ్డులో ఉన్న స్థలంలో వాణిజ్యపరంగా తీర్చిదిద్దితే పురపాలక సంఘానికి భారీగా ఆదాయం సమకూరేది. సొంత భవనం నిర్మిస్తే ఆ సమస్య కూడా తీరేది. ఈ రెండింటికీ కాకుండా ఇతర అవసరాలకు స్థలాలను కేటాయించడంతో ఆదాయానికి గండి పడుతుండటంతో పాటు నూతన భవనం నిర్మాణానికి స్థలం లేకుండా పోయింది.



హామీ ఏమైందయ్యా..

పురపాలక సంఘ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కంబాల జోగులు హామీ ఇచ్చారు. ఎన్నికలు ముందు ఇచ్చిన హామీ ఐదేళ్లు దాటినా ఇంతవరకు నెరవేరలేదు. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ఏమైందని మున్సిపాల్టీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

శిథిలమవడం వాస్తవమే

ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడం వాస్తవమే. పాతది కావడంతో పైకప్పు పెచ్చులూడుతోంది. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిరుపయోగంగా ఉన్న అన్న క్యాంటీన్ కోసం నిర్మించిన భవనాన్ని ప్రజారోగ్యశాఖ శానిటరీ ఇన్‌స్పెక్టర్, పట్టణ ప్రణాళిక విభాగం కార్యాలయాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించాం. ఇది కూడా తాత్కాలిక ఏర్పాట్లు మాత్రమే. సొంతభవనం అందుబాటులోకి వస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు.

– రామప్పలనాయుడు, కమిషనర్, పురపాలక సంఘం, రాజాం


1957లో ఏమైందంటే..!

మీకు తెలుసా

(రాజాం రూరల్)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం అనంతరం 1957లో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పుడు రాష్ట్రంలో 55,61,345 మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా... 36,03,585 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మరి ఇప్పుడో...ఈ ఓటర్ల సంఖ్య ఒక జిల్లా ఓటర్లతో సమానం.. నాటికీ నేటికీ ఎంత తేడా. 1957లోని మరికొన్ని విశేషాల సమాహారం కొత్తతరం ఓటర్ల కోరం..

- 1957లో ఏపీలో 85 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.
- రాష్ట్ర వ్యాప్తంగా 47.67 శాతం పోలింగ్ నమోదైంది..
- మొదటి అసెంబ్లీ నియోజకవర్గంగా కల్వకుర్తి, చివరి అసెంబ్లీ నియోజకవర్గంగా దేవరకొండ ఉండేవి.
- రాష్ట్ర వ్యాప్తంగా 493 మంది నామినేషన్లు వేయగా... వాటిలో 174 తిరస్కరణకు గురయ్యాయి. ఒక్కరు కూడా నామినేషన్ ఉపసంహరించుకోలేదు.
- పోటీ చేసిన 319 మంది అభ్యర్థులలో 81 మంది డిపాజిట్లు కోల్పోయారు.
- రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది మహిళలు పోటీ చేయగా... వారిలో ఏడుగురు విజయం సాధించారు.
- మూడు నియోజకవర్గాల్లో ఒక్కొక్క అభ్యర్థి మాత్రమే ఎన్నికల బరిలో ఉండడంతో వారు ఏకగ్రీవంగా శాసనసభ్యులయ్యారు.
- 18 నియోజకవర్గాలలో ఇద్దరేసి అభ్యర్థులు పోటీ చేశారు. 25 స్థానాలలో ముగ్గురేసి, 21 స్థానాలలో నలుగురేసి, మూడుస్థానాలలో అయిదుగురు, 15 స్థానాలలో ఆరు నుంచి పదిమంది ఎన్నికల బరిలో పోటీచేశారు.
- కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో) నియోజకవర్గం నుంచి అత్యధికంగా పదిమంది అభ్యర్థులు పోటీ చేశారు.
- మొత్తం 85 నియోజకవర్గాలలో 18 స్థానాలు ఎస్సీలకు, రెండు స్థానాలు ఎస్టీలకు కేటాయించారు.
- కాంగ్రెస్‌కు 47.38 శాతం ఓట్లు పడ్డాయి. ప్రజా సోషలిస్ట్ పార్టీకి 5.65 శాతం, భారతీయ జనసంఘ్‌కు కేవలం 0.16 శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రాంతీయ పార్టీ పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్‌కు 36.46 శాతం ఓట్లు వచ్చాయి..



నామినేషన్ల పర్వం

విజయనగరం జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి.. తమ అభిమాన నేతలకు అభినందనలు తెలిపారు.



చీపురుపల్లి: కళావెంకటరావు నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన టీడీపీ శ్రేణులు



ఎస్.కోట: పార్టీ శ్రేణులతో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న కోళ్ల లలితకుమారి

బాబు, పవన్‌కు ఘన స్వాగతం



విక్టరీ సంకేతం చూపిస్తున్న యువత

నెల్లిమర్ల: డెంకాడ మండలం సింగవరం రోడ్‌షోకు హెలికాప్టర్‌లో వచ్చిన చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్దఎత్తున పుష్పగుచ్ఛాలను అందజేసి.. స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి, టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగారాజుతో పాటు సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, పతివాడ అప్పలనారాయణ, నెల్లిమర్ల మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, డెంకాడ మండల కమిటీ అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, జనసేన నాయకురాలు పడాల అరుణ, ఆదాడ మోహన్, బీజేపీ నాయకుడు బూర్లె శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రం విజయనగరంలో రోడ్ షో కొనసాగించారు.

సైడ్‌లైట్స్..

- హెలిప్యాడ్ నుంచి ఓపెన్ టాప్ జీపులో రోడ్ షో కు వెళ్తూ చంద్రబాబు, పవన్ అభివాదం చేయడంతో జనం ఉప్పొంగిపోయారు.
- సభా ప్రారంభం సమయంలో చిన్న చిన్న చిరుజల్లులు పడడంతో శుభ సూచికమంటూ జనం ఆనందం వ్యక్తం చేశారు
- సభకు వచ్చిన వారిని చూసి జనం సముద్రం ఉప్పొంగినట్లు వచ్చారంటూ చంద్రబాబు అనడంతో వారిలో ఉత్సాహం కనిపించింది.
- కర్రోతు బంగార్రాజు పేరును చంద్రబాబు ఉచ్చరించగానే జనం చప్పట్లతో కేరింతలు కొట్టారు.
- చంద్రబాబునాయుడు యువకుడిలా మాట్లాడుతున్నారంటూ జనం చర్చించుకున్నారు.
- చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ప్రసంగం కొనసాగినంత సేపు జనంలో ఉత్సాహం కనిపించింది.
- సైకో జగన్ పోవాలి, బైబై వైసీపీ అని చంద్రబాబు అన్నపుడు మహిళలు సైతం కేరింతలు కొట్టి నృత్యం చేశారు.
- సీటు త్యాగం చేసిన బంగార్రాజు భవిష్యత్తును తాను చూసుకుంటానంటూ చంద్రబాబు అన్నప్పుడు అభిమానులు కేరింతలు కొట్టారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు స్వాగతం పలికేందుకు హెలీపాడ్ వద్ద వేచి ఉన్న కూటమి నాయకులు



సన్‌షేడ్‌పై నుంచి చూస్తున్న దృశ్యం



నెల్లిమర్లలో జనవాహిని..



రోడ్ షోలో చంద్రబాబు, పవన్ కల్యాణ్



విజయనగరం రోడ్ షోలో అభిమానులు

ఆమె.. పదిసార్లు 'డమ్మీ'!

- తండ్రి తరపున ఆరుసార్లు... కుమార్తెకు నాలుగుసార్లు
- ఆనవాయితీ కొనసాగిస్తున్న గొంప సత్యవతి

శృంగవరపుకోట/కొత్తవలస: శృంగవరపుకోట శాసనసభ నియోజకవర్గ పరిధిలోని కొత్తవలస మండలం నిమ్మలపాలెం గ్రామానికి చెందిన గొంప సత్యవతి డమ్మీ అభ్యర్థిగా రికార్డు సాధించారు. ఒకటీ.. రెండుసార్లు కాదు. వరుసగా పదిసార్లు డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను సమర్పించారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోళ్ల లలిత కుమారికి డమ్మీ అభ్యర్థిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణకు బుధవారం నామినేషన్ పత్రాలను అందించారు. ఆమె మాజీ మంత్రి దివంగత కోళ్ల అప్పలనాయుడు పెద్ద కుమార్తె. ప్రస్తుత శృంగవరపుకోట టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి తల్లి. ఉత్తరాపల్లి నియోజకవర్గం నుంచి 1983లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన తండ్రికి డమ్మీ అభ్యర్థిగా మొదటిసారి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆ తరువాత 1985, 89, 94, 99, 2004లో వరుసగా డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. పునర్విభజనలో ఈ నియోజకవర్గం రద్దు కావడంతో శృంగవరపుకోట జనరల్ నియోజకవర్గం నుంచి కోళ్ల అప్పలనాయుడు వారసురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన మనమరాలు, కోడలు కోళ్ల లలిత కుమారికు 2009, 2014, 2019లోను డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లలిత కుమారికి డమ్మీగా నామినేషన్ వేశారు. ఇలా మొత్తం పదిసార్లు డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈ పది పర్యాయాల్లో తన తండ్రి ఐదుసార్లు... కుమార్తె రెండు దఫాలు మొత్తం ఏడుసార్లు విజయం సాధించారు.



ఎస్.కోట ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందిస్తున్న టీడీపీ డమ్మీ అభ్యర్థి గొంప సత్యవతి

మా ఓటు మీకే..!

ఎట్సెట్రా

(కొమరాడ)

ఎన్నికల వేళ చిత్ర, విచిత్రాలు గోచరిస్తున్నాయి. ఓటర్ల నాడి పట్టలేక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఏ పార్టీ నాయకుడు పిలిచినా ర్యాలీలు, ప్రచారానికి హాజరవుతున్నారు. ఈ విషయం తెలుసుకుని అవతల పార్టీ వారు ప్రశ్నిస్తే 'ఇంటికి వచ్చి పిలిస్తే.. వెళ్లక తప్పడం లేదు అన్నా.. కానీ మా ఓటు మాత్రం మీ పార్టీకే వేస్తా'మంటూ సమాధానం చెబుతున్నారు. దీంతో వారు ఎవరికి ఓటు వేస్తారోనన్న అయోమయం అభ్యర్థుల్లో నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతోనే కొందరు ఇలా చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికే పట్టణాలు, గ్రామాల్లో ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో ప్రచారాలకు బహిరంగంగా వెళ్లి మద్దతు పలికి వారితో ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. సర్వేలు చేసేవారు కూడా ఇటువంటి వారిని ప్రశ్నిస్తే పార్టీలకేముంది ఎన్నికల రోజున మాకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తాం... అంతవరకు ఎవరికీ దూరం కాకుండా ఉండటానికే ఇలా చేస్తున్నామంటూ సమాధానం ఇస్తున్నారు.

టీడీపీ విజయనగరం పార్లమెంటు ఎన్నికల కోఆర్డినేటర్‌గా కేఏ నాయుడు

విజయనగరం(ఆంధ్రజ్యోతి): విజయనగరం పార్లమెంటు టీడీపీ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా గజపతి నగరం మాజీ ఎమ్మెల్యే డాక్టరు కెఏ నాయుడిని నియమిస్తూ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ప్రచారం, పార్టీ అభ్యర్థులు విజయం కోసం ఎప్పటికప్పుడు ఈయన రాష్ట్రపార్టీకి, పార్లమెంటు పార్టీకి అనుసంధానంగా వ్యవహరించనున్నారు. ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా నియమించిన డాక్టరు కెఏ నాయుడిని పలువురు అభినందించారు..

రేపు విద్యుత్ కోతలు

లక్కవరపుకోట: మండలంలోని ఎల్.కోట, మల్లివీడు సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల నరికివేత పనుల కారణంగా శుక్రవారం రెండు గంటలపాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని విజయనగరం రూరల్ విద్యుత్ ఆపరేషన్ విభాగం ఈఈ సురేష్‌బాబు తెలిపారు. ఎల్.కోట, సోంపురం జంక్షన్, సంతపేట జంక్షన్‌లోనూ, మల్లివీడు సబ్‌స్టేషన్ పరిధిలోని జమ్మాదేవిపేట, దాసుల్లుపాలెం, గేదెలవానిపాలెం, గనివాడ, వేచల వానిపాలెం, అర్జీపేట, కొత్తపాలెం, శ్రీరాంపురం, తామరా పల్లి, మార్లాపల్లి, లింగంపేట, చందులూరు, కిత్తన్నపేట గ్రామాలకు శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 9గంట ల వరకు విద్యుత్ ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

అసభ్యకర ఫొటోలు పెడుతున్నారు

గుర్ల: జనసేన, బీజేపీ రాష్ట్ర నాయకులపై కొంతమంది గ్రామ వలంటీర్లు అసభ్యకరమైన ఫొటోలు పెడుతున్నారని బీజేపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి పాక నాగమల్లిక ఆరోపించారు. బుధవారం పెనుబర్తి గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కొంతమంది వలంటీర్లు వారి వాట్సప్ స్టేటస్‌లలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారని చెప్పారు. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల అధికారులకు తెలియజేశామన్నారు.

చంద్రబాబుతోనే మహిళల అభ్యున్నతి

దత్తిరాజేరు: రాష్ట్రంలో మహిళల అభ్యున్నతి చంద్రబాబుతోనే సాధ్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ సతీమణి లక్ష్మీసింధు అన్నారు. బుధవారం కోరపుకొత్తవలస గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట పలువురు నాయకులు ఉన్నారు.

నియోజకవర్గాల్లో ఎన్నికల పరిశీలకుడి పర్యటన

కలెక్టరేట్: అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 26 నుంచి ఎన్నికల సాధారణ పరిశీలకులు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా పర్యటించనున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆయన ఇక నుంచి వారంలో ఒకటి రెండు రోజుల్లో అందుబాటులో ఉంటారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థులు అక్రమాలపై పరిశీలకున్ని సాధారణ ప్రజలు సైతం నేరుగా కలిసి ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. అంతేకాకుండా పరిశీలకుని సెల్ నెంబరు 9032338136కి ఫోన్ చేసి గాని, మెయిల్ ద్వారా గాని అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన, నగదు, మద్యం, ఇతర విలువైన ఆభరణాలు వస్తువుల పంపిణీ తదితర ప్రలోభాలకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదు చేయవచ్చు.

రొంపల్లిలో టీడీపీ ఇంటింటి ప్రచారం

రామభద్రపురం: మండల పరిధిలోని రొంపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు మద్దతుగా బుధవారం ఎంపీటీసీ సభ్యులు బవిరెడ్డి శంకరరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ ప్రజలకు ఎంతగానో చేరువైందన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ సౌకర్యం, ప్రతీ మహిళకు నెలకు రూ.1500ల చొప్పున ఆర్థిక సహకారం, రైతులకు రైతు భరోసా కింద సంవత్సరానికి రూ20వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లు ఉచితం తదితర వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు. వైకాపా ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రాన్ని అన్ని విధాలా నష్టపరిచిందని ప్రజలంతా చైతన్యవంతులై టీడీపీని గెలిపించాలన్నారు. ఈ ప్రచారంలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అదితికి ఆశీర్వాదం

విజయనగరం రూరల్: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజుని నగర పరిధిలోని వర్తక, వ్యాపార, వాణిజ్య, స్వచ్ఛంద, వాకర్స్, సీనియర్ సిటిజన్స్‌తో పాటు పలువురు ఆమెను బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆశీర్వదించారు. ఆమె నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమానికి ముందు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తొలుత కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌లు సునీలా గజపతిరాజు, ప్రసాదుల కనక మహాలక్ష్మీతో పాటు, నగరంలోని ప్రముఖులు ఆమెను ఆశీర్వదించారు. వచ్చిన వారందరి ఆశీర్వాదం తీసుకున్న ఆమె 10.30 గంటల ప్రాంతంలో కొద్ది మంది పార్టీ నాయకులతో కలిసి ఆమె విజయనగరంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని, నామినేషన్‌ను దాఖలు చేశారు.

పలువురి నామినేషన్

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీకి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేస్తున్న బాడంగి మండలం కోడూరు గ్రామానికి చెందిన మరిపి విద్యాసాగర్ (వినయ్) పార్టీ బి.ఫారమ్‌ను ఆర్వోకు అందజేశారు. బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన రెడ్డి కిరణ్‌కుమార్ సమాజ్‌వాది పార్టీ తరపున నామినేషన్ వేయగా, రామభద్రపురం మండలం బూశాయవలస గ్రామానికి చెందిన తుమరాడ రమణమ్మ నవభారత నిర్మాణసేవ పార్టీ తరపున నామినేషన్ వేశారు.

జేసీ రాజు వితరణ

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో మూతపడిన జూట్ మిల్లుకు చెందిన కార్మికుడు పక్షవాతానికి గురై మంచానికే పరిమితం కావడంతో స్థానిక కారుణ్యా ఫౌండేషన్, రోటరీక్లబ్ చైర్మన్ జేసీ రాజు మానవతతో స్పందించారు. పక్షవాతంతో బాధపడుతున్న ఇబ్బందులు పడుతున్న పిరిడి రాంబాబు అనే జూట్ కార్మికుడు స్థానిక తారక రామాకాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆయన నివాసానికి జేసీ రాజు వెళ్లి పరామర్శించారు. మందుల కోసం ఐదు వేల రూపాయలు, మరో ఐదువేల రూపాయల నిత్యావసర సరుకులను అందజేశారు.

చెరువుల వద్ద ప్రచారం

రాజాం: టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను గెలిపించాలని మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు బెహరా తవుడు కోరారు. ఆయన బుధవారం వంగర మండలం మడ్డువలస, ఓనీ సంఘాం గ్రామాల్లో చెరువుల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్‌ను గెలిపిస్తే అన్ని రకాలుగా మత్స్యకారులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. మత్స్యకారులకు రాయితీపై రుణాలతో పాటు వలలు, ద్విచక్రవాహనాలు అందజేస్తారన్నారు. చెరువుల్లో చేపలు పెంపకానికి అనుమతులు వస్తాయని వివరించారు.

బొడ్డవలస వరదగట్టుకు అపాయం?

- ఉపాధిలో భాగంగా పక్కనే ఉన్న చెరువులో తవ్వకం
- ఇప్పటికే గట్టుకు మరమ్మతులు లేక పొంచి ఉన్న ప్రమాదం

రేగిడి: ఉపాధి హామీ పథకం కూలీలకు, రైతులకు ప్రయోజన కరంగా ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యం కొన్ని గ్రామాల్లో నీరుగారిపోతోంది. కూలీలకు పనిఇవ్వాలన్న సంకల్పం తప్పితే దానివల్ల ప్రయోజనం ఏపాటిదో ఆలోచించటం లేదు. కొన్నిచోట్ల దానివల్ల మేలు కంటే నష్టం కలిగే పరిస్థితులు వెలుగులోకి వస్తున్నాయి. నంకిలి పంచాయతీ బొడ్డవలస నాగావళి తీరంలో స్థానికంగా ఉన్న శివాలయం పైభాగాన ఒక కిలోమీటరు వరదగట్టు ఉంది. రేగిడి, సంతకవిటి మండలాల ఆయకట్టు పొలాలు, స్థానికంగా ఉన్న ఇరిగేషన్ చానల్స్‌కు వరదల నుంచి దెబ్బలేకుండా రెండువైపులా రివైట్‌మెంట్ రాయితో గట్టును ఏర్పాటు చేశారు. ఇదేతీరంలో గట్టు కోతకు గురికాకుండా గ్రోయిన్స్ ఉండేవి. కాలక్రమంలో రక్షణగా ఉన్న గ్రోయిన్స్ కొట్టుకుపోయాయి. ప్రస్తుతం గట్టు బలహీనంగా ఉంది.

ఇక్కడ ఉపాధి అసలుకే మోసం

నంకిలి పంచాయతీ బొడ్డవలస వద్ద నాగావళి శివాలయం పైభాగాన ఉన్న ఒక కిలోమీటరు వరదగట్టుకు అధికారులు ఉపాధి హామీ పథకం వర్తింపు చేస్తున్నారు. గత ఏడాది ఇదే గట్టును ఉపాధిలో మట్టి పోసే చర్యలు చేపట్టారు. ఈఏడాది మరళా ఈగట్టను బాగుచేస్తున్నారు. ఉపాధి కింద నిధులు మంజూరు చేసి స్థానికంగా ఉన్న ఊటచెరువు తవ్వకం చేసి దీని మట్టిని వరదగట్టుపై పొస్తున్నారు. వాస్తవంగా ఈచెరువు నిండా నీరు ఉంది. ఇది ఊటచెరువుకావటం నీరు ఇంకే పరిస్థితి తక్కువ. దీంతో ఈచెరువలో మట్టితీసేందుకు అవకాశం అంతంత మాత్రమే. దీంతో వరదగట్టు కిందభాగంలో బంటాలు తీసి గట్టు పటిష్టం చేస్తున్నారు. వాస్తవంగా ఇది రెండువైపులా రాతి రివెట్‌మెంట్‌తో నిర్మించి ఈ గట్టును బాగుచేస్తే కాని పటిష్టమవ్వదని స్థానికుల అభిప్రాయం. అధికారపార్టీ నేతల పొలాలకు ఇదే మార్గం కావటం, ఉపాధిలో ఈ గట్టు బాగుచేస్తున్నట్లు కొంతమంది ఆరోపిస్తున్నారు. దీనివల్ల ప్రయోజనం కన్నా గట్టు ఇంకా బలహీనపడే సూచనలు కనిపిస్తున్నాయి.

ఇక్కడ గట్టుకొడితే రెండు మండలాలకు ముప్పు

బొడ్డవలస వద్ద కింద భాగంలో 800 మీటర్లు నిర్మించాల్సిన కరకట్టు సగంలో నిలిచిపోగా, శివాలయం పైభాగాన బ్రిటిష్‌కాలంలో ఏర్పాటుచేసిన కిలోమీటరు వరదగట్టు అత్యంత బలహీనదశలో ఉంది. ఉపాధిలో భాగంగా ఈ గట్టును బాగుచేయటంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. పైగా గట్టు దిగువ పొడిచి గట్టుపై మన్నుపోయటం అంత శ్రేయస్కరం కాదని కొంతమంది రైతుల అభిప్రాయం. ఇక్కడ నాగావళి ఉధృతంగా పారే ప్రాంతంకావటం, భవిష్యత్తులో వరదలు వస్తే ఇక్కడ జరగరానిది జరిగి గండికొడితే రేగిడి, వంగర మండలాల ఆయకట్టు పొలాలకు ముప్పుఉండే అవకాశం ఉంది.

గట్టు బాగుచేయాలనే: ఏపీవో హరనాథ్

వరదగట్టుకు ఉపాధి వర్తింపు, దీనివల్ల అప్రయోజనం, నష్టం ఉన్న పరిస్థితులు ఉపాధి ఏపీవో హరనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ వద్ద ఆంధ్రజ్యోతి ప్రస్తావించగా, ఊరుచెరువుకు ఉపాధిలో బాగంగా తీసిన మట్టిని వరదగట్టును బాగుచేస్తున్నట్లు తెలిపారు. వరుసగా రెండో ఏడాది ఈచెరుకు ఉపాధి కింద బాగుచేస్తున్నట్లు తెలిపారు. చెరువు కింద భాగంలో బంటాళ్లు తీసి మట్టి సేకరిస్తున్నట్లు, వరదగట్టు పొడవటం లేదని తెలిపారు. దీనిపై పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని ఏపీవో వెల్లడించారు.



బొడ్డవలస వద్ద నాగావళి రక్షణగా ఉన్న వరదగట్టుపై అక్కడే తీసిన మట్టి పోసిన దృశ్యం

వరదగట్టుకు పూర్తిస్థాయి పనులు చేయాలి

బొడ్డవలస వద్ద వరదగట్టు పూర్తి బలహీనంగా ఉంది. కిందభాగాన వరదగట్టు మధ్యలో నిలిచిపోగా, పైభాగాన ఉండే వరదగట్టు ఇప్పటికే శిథిలావస్థలో ఉంది. గతంలో 10అడుగుల వెడల్పు ఉన్న గట్టు ఇప్పుడు మూడు అడుగులు మాత్రమే ఉంది. దీనికి ఉపాధిలో అక్కడే గట్టు పొడిచి గట్టు బాగుచేయటం అభ్యంతకరం.

-మజ్జి అప్పలనాయుడు, బొడ్డవలస, మాజీ నీటిసంఘం అధ్యక్షుడు

వైభవంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామ శివారు అంకాజోస్యులపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్ద భోజంకి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు యువకులు, భక్తులు ఆధ్వర్యంలో వేదపండితులు విగ్రహ ప్రతిష్ఠను చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటల తరువాత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో వేలాదిగా పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను పురష్కరించుకొని గ్రామ పెద్దలు ఏర్పాటు చేసిన మహిళా కోలాటం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్.కోట పోలింగ్‌స్టేషన్‌ల పరిశీలన



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

శృంగవరపుకోట: శృంగవరపుకోటలోని 17, 18, 19, 22, 23, పోలింగ్ స్టేషన్‌లను బుధవారం జనరల్ అబ్జర్వర్ సీతారామ్ జాట్ పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లోని సదుపాయాలను చూసారు. అంతకు ముందు శాసన సభ నామినేషన్ పక్రియను గమనించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి కృష్ణ, సహయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

అండగా ఉంటా.. ఆశీర్వదించండి: బేబీనాయన



మల్లమ్మపేట ఎన్నికల ప్రచారంలో బేబీనాయన, తెంటు, గిరడ, మరిశర్ల

తెర్లాం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కొల్లివలస, కొరటాం, సీతారాంపురం, సింగిరెడ్డివలస, బొంగుపేట గ్రామాల్లో బేబీనాయన ప్రచారం చేశారు. ప్రచారంలో పాల్గొన్న ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి తమకు మద్దతు తెలపాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మం నాయుడు మాట్లాడుతూ టీడీపీకి ఓటు వేయాలని కోరారు. టీడీపీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకట నాయుడు, వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ● మండలంలో కొరటాం గ్రామంలో సుమారు 15 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఉమ్మడి టీడీపీ అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుంనాయుడు వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

● **బొబ్బిలి:** బొబ్బిలి పట్టణ పరిధిలోని మల్లమ్మపేట గ్రామంలో బుధవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, పెద్దింటి మనోజ్‌కుమార్, బీజేపీ ఇన్‌చార్జి మరిశర్ల రామారావు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి: కోండ్రు



మాట్లాడుతున్న కోండ్రు

వంగర: రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యమని రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రుమురళి అన్నారు. వంగర మండలంలోని వీవీఆర్ పేట, రాజులగుమ్మడ, రుషింగి తలగాం, మద్దివలస, కొప్పరవలసలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ముందుగా కోండ్రుకు టీడీపీ యువత మోటారు సైకిల్ ర్యాలీతో స్వాగతం పలికారు. మహిళలు తిలకం దిద్ది అభినందించారు. రాజులగుమ్మడ, కొప్పరవలసలో సుమారు 70 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

నా బిడ్డ భవిష్యత్తు నాశనం చేశారు

శృంగవరపుకోట రూరల్: పరీక్ష ఫీజు కట్టలేదని తన బిడ్డను పరీక్ష రాయనీయకుండా అడ్డుకుని, భవిష్యత్తును నాశనం చేశారని ధర్మవరం గ్రామానికి చెందిన ఎం.విజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. తన బిడ్డ హెప్సిబా ఓ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతుందని, అయితే ఈనెల 22న ఫైనల్ పరీక్షకు హాజరయ్యే సమయంలో ఫీజు కట్టలేదని చెప్పి హాల్‌టికెట్ ఇవ్వకుండా ఎగ్జామ్ రాయనివ్వలేదన్నారు. కాళ్లా వేళ్లా పడ్డా వారు కనికరించలేదని విలపించారు. దీనిపై తాను ఎస్.కోట పోలీసులు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే విషయంపై కళాశాల యాజమాన్య ప్రతినిధిని వివరణ కోరగా సదరు హెప్సిబా తమ కళాశాలలో మూడు సంవత్సరాలు చదువు పూర్తిచేసిందని, పూర్తి ఫీజు కట్టలేదని.. అదేవిధంగా ఆమె తండ్రి తమను బెదిరించే ధోరణిలో మాట్లాడారని తెలిపారు. ఎవరైనా ఫీజులు కట్టకపోతే కళాశాల ఎలా నడిపిస్తామని అన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

పాలకొండ: రైతులు వ్యవసాయ అధికారుల సూచన లు, సలహాలు పాటించాలని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు అన్నారు. విశాఖపట్నంలో వ్యవసాయ శాఖ ఉన్నత పర్వత శ్రేణి, గిరిజన మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. జిల్లాలో ని నాలుగు మండలాల్లో రైతులు నూతన వ్యవసాయ పరిజ్ఞానానికి దూరమయ్యారన్నారు. ఇక్కడ వ్యవసాయం పై పరిజ్ఞాన శిక్షణా తరగతులు నిర్వహించాలని ఆయన కోరారు. శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి

- అరకు ఎన్డీఏ ఎంపీ అభ్యర్థి గీత



మాట్లాడుతున్న కొత్తపల్లి గీత

మెంటాడ: రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజిన్ సర్కారుతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని అరకు పార్లమెంట్ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కొత్తపలస గీత అన్నారు. బుధవారం ఆమె మెంటాడ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన నడుస్తోందన్నారు. చంద్రబాబు, మోదీలతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళలంతా చంద్రబాబు వెనుకే: కోళ్ల

లక్కవరపుకోట: నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలంటే మహిళలంతా కలిసికట్టుగా పనిచేయాలని ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి కోరారు. బుధవారం మండలంలోని దాసుల్లుపాలెం, కూర్మవరం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను మహిళలకు వివరించారు. రాక్షసపాలనకు చరమగీతం పాడాలన్నారు. ఈమె వెంట మండల పార్టీ నేతలు హాజరయ్యారు.

ఘనంగా శ్రీసత్యసాయి ఆరాధనోత్సవం



బాబా పారాయణం చేస్తున్న భక్తులు

బొబ్బిలి: భగవాన్ శ్రీసత్యసాయి ఆరాధనోత్సవ కార్య క్రమాలు బుధవారం బొబ్బిలి పట్టణంలో చాలా ఘనంగా జరిగాయి. పట్టణంలోని పూల్‌బాగ్ లోగల సత్యసాయి మందిరంలో సేవాసమితి ఆధ్వర్యంలో వేకువ జామున ఐదుగంటలకు సు ప్రభాత సేవతో ప్రారంభమైన ఉత్సవాలు స్వామివారి పాదుకలతో నగరసంకీర్తన, రుద్ర పారాయణ, సాయిగాయత్రితో తండులార్చన, ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 97 నిమిషాల భజన, నారాయణ సేవ (భోజన వితరణ), ఆధ్యాత్మిక ఉపన్యాసం, దివ్యమంగళహారతి కార్య క్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు చెప్పులు, గొడుగులను పంపిణీ చేశారు.

టీడీపీలో 50 కుటుంబాల చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కళా వెంకటరావు

గరివిడి: భైరిపురం పంచాయతీ నుంచి పప్పల కృష్ణ (మిల్లి కృష్ణ)తో సహా 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. బుధవారం చీపురుపల్లిలో ని టీడీపీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు.

కుక్కల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి సమీపంలో పెట్రోల్ బంకు వద్ద గంట లక్ష్మీ అనే మహిళపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో ఆమె తీవ్ర గాయాలపాలయ్యింది. ట్రాక్టర్ మెకానిక్ అయిన గంట రవీంద్ర తన భార్యతో కలిసి పెదమేరంగి కూడలి వద్ద తమ ఇంటికి సమీపంలో మెకానిక్ షాపు నడుపుకుని జీవిస్తున్నారు. ఉదయాన్నే షాపు తలుపులు తీయగానే ఒక్కసారి 17 కుక్కలు ఆమెపై దాడి చేశాయి. ఆమె కేకలు వేయడంతో అక్కడే ఇంట్లో ఉన్న భర్త వచ్చి వాటిని తరమగా అవి విడిచిపెట్టి వెళ్లిపోయాయి. లేదంటే ఖచ్చితంగా ఆమె మృతి చెందేది అని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈమెకు మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఉన్న సౌజన్య హాస్పిటల్‌కు హుటాహుటిన తీసుకెళ్లారు. అక్కడ ఆమె పరిస్థితి కొంత ఆందోళనకరంగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, కుక్కల ఏరివేత కార్యక్రమం చేయాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గంట్యాడ: పనికి వెళ్లకుండా మద్యం తాగుతూ ఉండడంపై భార్య అడిగినందుకు మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సురేంద్రనాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంట్యాడ గ్రామానికి చెందిన జి.సీతారామరాజు(44) గత పది రోజుల నుంచి పనికి వెళ్లకుండా మద్యం తాగుతూ ఇంట్లో ఉండటంతో ఆయన భార్య ప్రశ్నించింది. దీంతో మనస్తాపానికి గురైన సీతారామరాజు మంగళవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడాడు. వెంటనే నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధిక లోడుతో వెళ్తున్న 4 లారీలు సీజ్



ఆర్టీవో అధికారులు పట్టుకున్న లారీ

బొండపల్లి: నిబంధనలకు విరుద్ధంగా అధిక గని బుగ్గి లోడుతో వెళ్తున్న నాలు గు లారీలను పట్టుకుని సీజ్ చేశామని ఆర్టీవో ఐశ్వర్యలక్ష్మి బుధవారం తెలిపారు. మండల కేంద్రం మీదుగా విశాఖపట్టణం నుంచి గజపతినగరం వైపు హరిత రహదారి నిర్మాణం కోసం నిబంధనలకు మించి అధికంగా నాలుగు లారీల్లో బుగ్గిని తీసుకుని వెళ్తుండగా అందిన సమాచారం మేరకు పట్టుకుని సీజ్ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

వింత దూడ జననం

గరివిడి: గుర్ల మండలం గొలగాం గ్రామానికి చెందిన కలిశెట్టి మురళి అనే రైతుకు చెందిన ఆవుకు వింత దూడ జన్మించింది. ఈ ఆవును రైతు గరివిడి పశు వైద్య కళాశాలకు తీసుకు రాగా, అక్కడి వైద్యులు ఆపరేషన్ చేసి, ఈ వింత దూడను గర్భం నుంచి బయటికి తీశారు. ఈ దూడ రెండు తలలు, రెండు తోకలు, మూడు నాలుకలు, ఆరు కాళ్లతో పుట్టింది. అయితే ఈ దూడ అప్పటికే మృతిచెందింది.



మృతి చెందిన వింత దూడ

పేద బ్రాహ్మణుడిపై దాడి

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

రాజాం రూరల్, ఏప్రిల్ 24: వేదం నేర్చుకునేందుకు మున్సిపాలిటి పరిధిలోని కొత్తవలసకు చెందిన భరద్వాజ్ మౌళి కొన్నాళ్ల క్రితం ఓ ఆలయ పూజారి వద్ద చేరారు. కొన్నాళ్లుగా ఆయన వద్ద వృత్తిపరమైన అంశాలను నేర్చుకుంటున్నారు. కొద్దిరోజుల క్రితం భరద్వాజ్‌పై ఆలయపూజారి చేతులు, వీపు వెనుక భాగంతో పాటు ఒళ్లంతా ఇష్టారాజ్యంగా కొట్టారు. అయినాసరే భరద్వాజ్ నోరుమెదపకుండా బాధపడుతూ ఆలయ పూజారి వద్దనే ఉంటూ వేదం నేర్చుకుంటున్నారు. దీనిని గ్రహించిన విలేకర్లు ఒళ్లంతా దెబ్బలతో ఉన్న భరద్వాజ్‌ను ఏమైందని ప్రశ్నిస్తే తొలుత మౌనం ప్రదర్శించాడు. కొద్దిసేపటి తర్వాత.. గురువుగారే తనను కొట్టారని స్పష్టం చేశారు. వేదం నేర్చుకునే సమయంలో చిన్నపాటి తప్పులు జరగడంతో కొట్టినట్లు స్పష్టం చేశాడు. అయితే బరద్వాజ్‌ను తాను కొట్టలేదని ఆలయ పూజారి స్పష్టం చెబుతున్నారు. సైకిల్ నేర్చుకుంటున్న సమయంలో పడిపోయి దెబ్బలు తగి లాయని వివరించారు. అతని భవిష్యత్తు కోసం మందలించానే తప్ప కొట్టలేదని పేర్కొన్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నది ఒడ్డున ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ధర్మకర్త గోపాలకృష్ణ, భారతి దంపతులు 108 రకాల మిఠాయిలను, పండ్లను వారి ఇంటి నుంచి మేళ తాళాలతో ఊరేగింపుతో తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. సువర్ణముఖి నదిలో స్వామివారికి చక్రస్నానం చేశారు. ఈ వార్షికోత్సవంలో భాగంగా వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించారు. ఈసందర్భంగా విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.